

28వ రోజుకు రైతుల దీక్ష



దీక్షల్లో పాల్గొన్న రైతులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి సాగు భూములిచ్చిన తమకు ఒప్పందం మేరకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత గిరిజను రైతులు చేపడుతున్న దీక్షలు మంగళారం26వ రోజుకు చేరుకున్నాయి. బాధిత గిరిజనులు డొంబు, రాంచందర్ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి సాగు భూములు ఇచ్చి ఏడేళ్లు కావస్తోందన్నారు. ఉపాధి కల్పిస్తామని లిఖితపూర్వకంగా హామిలిచ్చిన అధికారులు ముఖం చాటేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

గోమంగిలో గొంతెండుతోంది!

- వేసవికి ముందే తాగునీటికి గిరిజనం కటకట
- అర్ధాంతరంగా నిలిచిన జల్‌జీవన్ మిషన్ పనులు
- సుదూరాన ఉన్న పొలాల్లోని ఊటనీరే గతి
- మన్యవాసుల గోడుపట్టించుకోని అధికారులు, నేతలు



దూరాన ఉన్న పొలాల నుంచి బిందెలతో ఊటనీటిని తెచ్చుకుంటున్న గిరి మహిళలు

ప్రజాశక్తి-పెదబయలు : వేసవికి ముందే గిరిజన గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొంటోంది. సహజ సాగునీటి వనరులు అడుగంటిపోగా, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాల్సిన బోర్లు, కుళాయిల వంటి పనులు అరకొరగా నిలిపేయడంతో తాగునీటికి కటకట తప్పడం లేదు, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు, చర్యలంటూ అధికారులు హడావిడి చేసినా, అవి గిరిజన గ్రామాల్లో ప్రజల దాహార్తి కష్టాలను తీర్చేందుకు ఏమాత్రం ఉపకరించడం లేదని జగమెరిగిన సత్యం. మండలంలోని గోమంగి పంచాయతీ పరిధిలోని సరియాపల్లి, సంతబయలు తదితర గ్రామాల గిరిజనుల తాగునీటి కష్టాలే ఇందుకు నిదర్శనం.

మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి, సంతబయలు తదితర గ్రామాల ఆదివాసీ గిరిజనులు అపుడే తాగునీటికి అల్లాడిపోతున్నారు. గ్రామంలో రక్షితమంచినీటి సదుపాయం లేకపోవడంతో దూరాన ఉన్న పొలాల్లో ఊటకుంటలు, చెలమల నుంచి నీటిని సేకరించి తీసుకొొచ్చి తాగునీరుతోపాటు ఇతర అవసరాలను తీర్చుకుంటున్నామని గ్రామ గిరిజనులతోపాటు ఉపసర్పచర్ కూడా మత్స్య కొండబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరైనా, ఆరునెలల క్రితం బోరును తవ్వి వదిలేసిన అధికార యంత్రాంగం, మిగతా పైపులైను, కుళాయిల ఏర్పాటు వంటి పనులు చేపట్టకపోవడంతో గిరిజనులకు తాగునీటిక ఇక్కట్లు తప్పడం లేదు. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేకపోవడంతో జల్‌జీవన్ మిషన్ నిధులు గోల్‌మాల్ చేశారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దీంతో ఉన్న నీటివనరుల నుంచి నీరు రాక, ప్రభుత్వపరంగా కుళాయి పనులు చేపట్టకపోవడంతో గోమంగి పంచాయతీ గిరిజనులు గత్యంతరం లేని పరిస్థితుల్లో సుదూరాన ఉన్న పొలాల్లోని ఊటకుంటల నుంచి బిందెలతో నీటిని మోసుకొొచ్చి అవసరాలను తీర్చుకుంటున్నారు. ప్రస్తుతానికి అక్కడ నీటి లభ్యత ఉన్నప్పటికీ, వేసవి ఎండలు ముదిరితే అక్కడ ఊటలు ఇంకిపోతాయోమోనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి విషమించకముందే, గ్రామంలో తవ్వి వదిలేసిన బోరు పాయింట్ నుంచి నీటి సరఫరాకు చర్యలు చేపట్టడంతోపాటు, జల్‌జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి తాగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు. స్థానిక జెడ్‌పిటిసి కూడా బొంజుబాబు స్వగ్రామంలోనే జల్‌జీవన్ మిషన్ పనుల దుస్థితి, గిరిజనుల తాగునీటి కష్టాలు ఇంత తీవ్రంగా ఉంటే, మండలంలోని మిగతా 23 పంచాయతీల్లోనూ, అందులోనూ మారుమూల గ్రామాల్లో నీటికష్టాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఇట్టే స్పష్టమౌతోందని గోమంగి పంచాయతీవాసులు అంటున్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణపై శిక్షణ



పోలింగ్ అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న డిఆర్ఒ పద్మలత

ప్రజాశక్తి -పాడేరు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిబంధనల మేరకు శాంతియుతంగా, సజావుగా నిర్వహణకు చర్యలు చేపట్టాలని, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డిఆర్ఒ కె.పద్మలత సూచించారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలింగ్ అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు ఒకరోజు శిక్షణ నిచ్చారు. ఈసందర్భం గా డిఆర్ఒ పద్మలత మాట్లాడుతూ, ఎన్నికలను నిబంధనల మేరకు, పారదర్శకంగా నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు నిర్వహణ, సీలు వేయడం, బ్యాలెట్ పత్రాలు వినియోగంపై అవగాహన కల్పించారు. డిస్ట్రిబూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రి సేకరణ సమయంలోనే సరిగా ఉన్నవీ లేనివీ సరిచూసు కోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయానికి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించి, పూర్తిచేయాలని సూచించారు కార్యక్రమంలో ఎస్‌డిసి లోకేష్, మాస్టర్ ట్రైనర్ చెల్లయ్య, సూపరింటెండెంట్ సిహెచ్. తిరుమలరావు, పిఒలు, ఎపిఒలు పాల్గొన్నారు.

అరకులోయ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

మహిళ పొట్టలోంచి భారీ కణితి తొలగింపు



కడుపులోంచి తొలగించిన కణితిని చూపుతున్న డాక్టర్ రాము

ప్రజాశక్తి- అరకులోయ : అరకులోయ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు.డుంబ్రిగూడ మండలం బల్లగడ్డ గ్రామానికి చెందిన 43 ఏళ్ల మహిళ మూడేళు గా కడుపునొప్పితో బాధపడుతుంది. స్కానింగ్ చేయగా కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించిన వైద్యులు, ఆసుపత్రి సూపరెంటిండెంట్, సర్జన్ డాక్టర్ రాము పర్యవేక్షణలో ఆపరేషన్ నిర్వహించి, 9 కిలోల బరువు, 35 □ 25 సెంటీమీటర్ల వ్యాసం కలిగిన అండాశయ కణితిని తొలగించారు.అరకు ఏరియా ఆసుపత్రిలో ఇటువంటి ఆపరేషన్ నిర్వహించినవైద్యులను స్థానికులు పలువురు అభినందిస్తున్నారు. గతంలో కూడా డాక్టర్ రాము అరకులోయ మండలానికి చెందిన ఓ గిరిజన మహిళకు ఇదే మాదిరిగా శస్త్ర చికిత్స నిర్వహించి అందరి మన్ననలు పొందారు.

అవకాశమిస్తే మీ గళమవుతా...

పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - టెక్కలి, సంతబొమ్మాళి, ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి, నరసన్నపేట, ఆమదాలవలస మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు, పరిణామాలను వివరించి తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలోని పది రకాల యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని చెప్పారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పనిచేశారని గుర్తుచేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.గణపతిరావు, జిల్లా అకడమిక్ సెల్ కో-కన్వీనర్ బి.రాజు, కె.పాపారావు, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు, టి.వైకుంఠరావు, తమ్మినేని పాపారావు, పైల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

విజయగౌరి విజయానికి విస్తృత ప్రచారం



పెదబయలులో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-పెదబయలు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న కోరెడ్ల విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్ అకడమిక్ కన్వీనర్ డి.రాము. జిల్లా కార్యదర్శి మొస్య ధర్మారావు, మండల కార్యదర్శి కన్నయ్య ఆనంద్ తదితరుల ఆధ్వరంయలో మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయ ఓటర్లను కలిసి, కరపత్రాలు పంచుతూ మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. స్థానిక రెసిడెన్సియల్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై, విజయగౌరి గెలుపు ఆవశ్యకతను వివరించారు. శాసనమండలిలో సమస్యలపై ఉపాధ్యాయ వాణి వినిపించా లంటే విజయగౌరిని గెలిపించా లని కోరాఉ. గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, న్యాయం చేసే సత్తా పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్న విషయాన్ని గుర్తించి ఓటేయాలని అభ్యర్థించారు. పలువురు యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం ప్రచారం చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ ఉద్యమాల్లో అగ్ర నాయకులుగా పనిచేస్తూ, విద్యారంగ సమస్యలపై ఎనలేని కృషి చేస్తున్న విజయగౌరిని గెలిపించాల్సి అవసరాన్ని వివరించారు. ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో గొంతువిప్పి ప్రశ్నించే అవకాశం ఒక మహిళకు ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నేత ఎస్.గాసిరాం దొర, మహిళా సంఘం ఐద్వా అధ్యక్షురాలుఈశ్వరి, ఉపాధ్యాయులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో గిరిజన సంఘం నేతల ప్రచారం

పునరావాస కాలనీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



పోలవరం పునరావాస కాలనీని సందర్శించి పెండింగ్ పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-దేవీపట్నం

పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు ముంపున గురైన పినికిలపాడు గ్రామానికి సంబంధించిన బాధితులకు పెద్ద భీంపల్లి-2లో, కొండ మొదలు, మెట్టగూడెం, తాళ్లూరు, తెలిపేరు, తాడివాడ గ్రామాలకు సంబంధించిన బాధితులకు పెద్ద భీంపల్లి-3లో మొత్తం 276 కుటుంబాలకు నిర్మిస్తున్న రెండు పునరావాస కాలనీలను ఆయన మంగళవారం పరిశీలించారు. రెండు కాలనీలలో ఈ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న స్కూల్, అంగన్వాడీ, గ్రామ సచివాలయ భవనాల పనులు, స్మశాన వాటిక ఇతర పెండింగ్ పనులు వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. కొంతమంది ముంపు బాధితులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, తహశీల్దారు కరక సత్యనారాయణ, ఎంపీడీవో రత్నకుమారి, డిప్యూటీ తాసిల్దార్ త్రిమూర్తులు, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలు పూర్తి కాకుండా నిర్వాసితులను ఎలా తరలిస్తారు?

సిపిఎం మండల కార్యదర్శి సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని 41.15 కాంటూర్‌లో గల గ్రామాలను పునరావాస కాలనీలకు తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పునరావాస కాలనీలు పూర్తి కాకుండా నిర్వాసితులను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. పునరావాస కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైనా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నేటి వరకు కల్పించలేదని, అంగన్‌వాడీ, స్కూల్ భవనాలు పూర్తిగా నిర్మించలేదని తెలిపారు. నిర్వాసితులను అక్కడికి పంపి ఎక్కడ ఉంచుతారని ప్రశ్నించారు. ముంపులో ఉన్న గ్రామాలలో పోడు, జిరాయితీ, అసైన్డ్ భూములకు నష్టపరిహారం నేటి వరకు చెల్లించలేదన్నారు. చొక్కనపల్లి గ్రామానికి పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెంలో కాలనీ నిర్మించారని, వారికి రావలసిన భూమికి భూమి నేటి వరకు అధికారులు చూపించలేదని, వారు అక్కడికెళ్లి ఏం చేసుకొని బతుకుతారని ప్రశ్నించారు. కొటారుగుమ్ము గ్రామంలోని కొండరెడ్ల కుటుంబాలకు మారేడుపూడి గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో దాదాపు 270 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చారని, నేడు వారి గ్రామాన్ని ఖాళీ చేస్తామంటున్నారని, వారి భూమికి పరిహారం ఇస్తారా? లేదా? వారి బతుకుదెరువు పరిస్థితి అనేది తేల్చాలని డిమాండ్ చేశారు. గ్రామాలను ఖాళీ చేయించాలనుకుంటే సత్వరమే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, భూ పరిహారాలు మొత్తం చెల్లించి, పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించి అప్పుడు మాత్రమే తరలించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, ఫంకు సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, శీరపు తాతబాబు, కమ్మచిచ్చు సత్యనారాయణ, కారం సుందరయ్య, కారం సత్తిబాబు, తోడం రాజు, కొండారెడ్డి, తుర్రం బాబురావు, వర్లాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల నమోదు వేగవంతం చేయాలన్నారు. ఆర్ఓఎఫ్ఐ పట్టాదారులకు పీఎం కిసాన్ ఎంతమందికి వస్తున్నదీ ఆరా తీశారు. పీసా చట్టంపై అవగాహన శిక్షణ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో ఆర్గానిక్ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యాన పంటలకు నాలుగు సంవత్సరాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమర్పించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో తాడి చెట్లు, జీలుగు చెట్లు ఎన్ని ఉన్నవి సర్వే చేసి జాబితాను, మత్స్య రైతులకు చేప పిల్లలు అభివృద్ధి చేయుటకు యాక్షన్ ప్లాన్‌ను సమర్పించాలని ఆదేశించారు. జీడి మామిడి తోటలపై ఆధారపడే రైతుల గురించి ఆరా తీశారు. జిల్లాలో జాఫర్ పంట సాగు, ఒక కిలో జాఫరాలకు ఎంత రేటు ఉన్నది తెలుసుకున్నారు. గోకులం పథకం ద్వారా పాడి రైతులను అభివృద్ధి చేయాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు టార్గెట్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవీంద్ర ధామ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, జిల్లా హార్టికల్చరల్ అధికారి ఎ.రమేష్ కుమార్, జిల్లా నేచురల్ ఫామింగ్ అధికారి ఎల్.భాస్కరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సిహెచ్. నరసింహం, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, పిహెచ్ఓ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే సావిత్రి, ఉపాధి హామీ ఎపిడి జి.శ్రీనివాసరావు అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు

ఫారెస్ట్ రేంజర్ ఉషారాణి



తవ్వకాల ప్రదేశంలో అటవీశాఖ అధికారులు సీజ్ చేసిన ప్రొక్లెయినర్, టిప్పర్ లారీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అటవీ ప్రాంతంలో ఎక్కడైనా ఎవరైనా అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారి ఉషారాణి హెచ్చరించారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని సూరంపాలెం గ్రామ శివారు తెల్లకొండ అటవీ ప్రాంతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగిన గిరిజన రైతు భూమి నుండి జాతీయ రహదారి 516ఇ రోడ్డు పనుల నిమిత్తం అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ శాఖ సిబ్బంది ఆ ప్రదేశానికి సోమవారం వెళ్లి మట్టి లోడ్ చేస్తున్న ఒక ప్రొక్లెయినర్‌ను, రెండు టిప్పర్ లారీలను సీజ్ చేసినట్లు చెప్పారు. తాళాలు పట్టుకొని డ్రైవర్లు పరారు కావడంతో తమ సిబ్బందిని కాపలాగా ఉంచి, ఒక్క లారీని మాత్రమే రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయానికి తరలించామని పేర్కొన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా ఉన్న సరే ఆ భూమిపై సర్వహక్కులు అటవీశాఖకే చెందుతాయని, ఆ భూములలో ఎవరైనా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తే నేరమని తెలిపారు. కొండపోడు పట్టా కలిగిన కొందుజాతి గిరిజన రైతును మంగళవారం అదుపులోకి తీసుకుని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలను చేపడతామని ఉషారాణి తెలిపారు.

ప్రతి మహిళా చదువుకోవాలి


ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

చదువుకున్న మహిళలు ఏ ఇంట్లో ఉంటే ఆ ఇంటితో పాటు గ్రామం బాగుపడుతుందని, అందువల్ల ప్రతి మహిళా చదువుకోవాలని చింతూరు యస్ఐ రమేష్ పేర్కొన్నారు. చింతూరులోని సాపిడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో 'అన్ని రంగాల్లో మహిళలు లీడర్ షిప్ సాధించడం' అనే అంశంపై యస్ఐ మాట్లాడారు. చదువుతో అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. సైబర్ నేరాలు గురించి, బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు గురించి సోదాహరణంగా వివరించారు. మహిళలు మావోయిస్ట్ భావజాలంపై మొగ్గు చూపగూడదని, వారికి సహకరించకూడదని తెలిపారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. స్త్రీల వ్యాధులు గురించి ప్రభుత్వ వైద్యశాల గైనకాలజిస్ట్ వెంకటరమణ వివరించారు. పొదుపు పథకాలు, డిపాజిట్లు గూర్చి ఎస్బిఐ ఎర్రంపేట మేనేజర్ ప్రసన్న కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాపిడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ అహ్మద్ అలీ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ ప్రారంభం



హుకుంపేట మండలంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

డుంబ్రిగుడ: గ్రామస్థాయిలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటునిచ్చి వారి విలువలను కాపాడాలని ఎంపిడిఒ ప్రేమ్ కుమార్ సూచించారు మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డుంబ్రిగుడ బాలుర, జాముగుడ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో అంగన్వాడీల శిక్షణలో మాట్లాడారు. పిల్లల్లో సమగ్ర అభివృద్ధితోపాటు విలువలతో కూడిన ఆట, పాట, మాట, విద్య, రాయడంలో పెంపొందించాలన్నారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని వీటిని చిన్నారులు అందించాలని సూచించారు. ఎంఇఒ సుందరరావు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ ముజీబ్, సిడిపిఒ నీలిమ, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1లో బుంగపుట్టు, కర్రిముక్కిపుట్టు, కిలగడ, వనబసింగి, ముంచంగిపుట్టు సెక్టార్ల నుండి 87 మంది అంగన్వాడీ కార్యకర్తల ఆరురోజుల శిక్షణ తరగతులను ఎంపిడిఒ జ్ఞాన జ్యోతి ప్రారంభించారు. శిక్షణను అంగన్వాడీలు సద్వినియోగం చేసుకుని, వాటిని కేంద్రాల్లో అమలు చేయడం ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలను అందించాలని ఎంపిడిఒ సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణమూర్తి, రత్నకుమార్, సిడిపిఒ వరహాలమ్మ , సూపర్వైజర్లు, రిసోర్స్‌పర్సన్లు ఆర్.పుండరీ, కె. మల్లికార్జున, జి.రామచంద్రుడు పాల్గొన్నారు.

హుకుంపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సహాయకరమైన ఆంధ్ర అభ్యాస పరివర్తన శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. సిడిపిఒ సిహెచ్ బాలామణిదేవి మాట్లాడుతూ, ఆరు రోజుల శిక్షణలో పిల్లలకు మెరుగైన ఆరోగ్యం, మంచి సంభాషణ కార్యకర్తలుగా చేయడం వంటి లక్ష్యాలు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భాషా, సంస్కృతిక అభివృద్ధి పెంపొందించడమే లక్ష్యమన్నారు. అంగన్వాడీ పిల్లలకు అలా అభివృద్ధి చేయాలంటే దానికి అవసరమైన నైపుణ్యాలు మెరుగుపరచాలని అంగన్వాడీలకు ఈ శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ కూడా ఈశ్వరరావు, అంగన్వాడీ సూపర్వైజర్లు గజపతి, రామోజీ, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం : 3-6 సంవత్సరాల పిల్లల్లో పూర్వ ప్రాథమిక విద్య, సంరక్షణ ఈసిసిఈ మెరుగుపరచే ఉద్దేశ్యంతో అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి పేర శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్.లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి(2) టి.మల్లేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడిపిఓ లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు ఏడాదిలో 40 రోజులు, మూడేళ్ల పాటు 120 మందికి ఆన్లైన్, ఆఫ్లైన్ ప్రాతిపదికన ఈసిసిఈపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు సిహెచ్ కృష్ణ, ఎస్ రాజేశ్వరి, ఏ నాయుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు టి సత్యవతి, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : అడ్డతీగల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగనవాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. అంగన్వాడీ టీచర్లకు నైపుణ్యాభివృద్ధి, బోధనలో మెలకువలు, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం పి.మంగరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పావని, సిఆర్‌పిలు ఎస్ నాగ ప్రసాద్, ఏ శ్రీను,అప్పలరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



పట్టుబడిన రంగురాళ్ల నిందితులు

రంగురాళ్ల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి -చింతపల్లి: గూడెం కొత్తవీధి మండలంలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా రంగురాళ్లు తవ్వుతున్న కాకినాడ జిల్లాకు చెందిన పదిమందిని పట్టుకున్ని అరెస్ట్ చేశారు. పెదవలస అటవీ శాఖ రేంజ్ అధికారిణి శివరంజని. అందించిన వివరాలివి. అందిన సమాచారం మేరకు గూడెం కొత్త వీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని సిగినాపల్లి అటవీ ప్రాంతంలో కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం పరిధిలోని వొమ్మంగి గ్రామానికి చెందిన ఏడుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ముఠాగా ఏర్పడి చింతపల్లి ప్రాంతం చెందిన కొంతమంది రంగురాళ్ల వ్యాపారస్తులతో కలిసి రంగురాళ్లను తవ్వుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు రూ 1 కోటి 80 లక్షలు వ్యాపార లావాదేవీలు జరిగినట్టు సమాచారం. గుట్టుగా రంగురాళ్ల తవ్వుతున్న వారి నుంచి నాలుగు గునపాలు, బియ్యం, వంట పాత్రలు, కూరగాయలు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి పి నూకరాజు, బీట్ అధికారి బి గోపి, ట్రై కింగ్ ఫోర్స్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టు నుంచి జారిపడి గిరిజనుడికి గాయాలు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: వంట చెరకు కోసం చెట్టెక్కిన ఓ గిరిజనుడు ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. లైగండ పంచాయతీ ఇసుకగరువు గ్రామానికి చెందిన టి ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఉదయం వంట చెరకు సేకరణకు చెట్టెక్కాడు. వంట చెరకు సేకరణలో గొడ్డలి వేస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు నుంచి జారిపడ్డాడు. ఘటనలో కుడి కాళ్లు విరిగి రక్తస్రావంతో కొట్టుమిట్టడాతున్న బాధితుడిని ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబీకులు 108కు సమాచారం అందించి అరకు హాస్పిటల్ కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పీసా కమిటీలకు కొనసాగుతున్న శిక్షణ

ప్రజాశక్తి -అనంతగిరి

గిరిజన ప్రాంతంలో వివాదాలను సాంప్రదాయ పద్ధతిలో పరిష్కరించుకోవాలని పీసా కమిటీ సభ్యులకు ఎంపిడిఒ ఎవివి.కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై దశలవారీగా పలువురు సర్పంచులకు, ఎంపిటిసిలు, వార్డు పీసా కమిటీ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన శిక్షణ తరగతుల్లో మూడవ రోజున ఎంపిడిఒ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ షెడ్యూల్ ఏరియాలో పీసా చట్టం 2011లోని నిబంధనలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అటవీ హక్కుల 2006 చట్ట ప్రకారం చిన్న తరహా అటవీ ఉత్పత్తులపై పీసా కమిటీలకు పూర్తి అధికారాలు ఉన్నాయన్నారు.

షెడ్యూల్ ఏరియాలో. గిరిజనుల అస్తిత్వాన్ని ,సాంప్రదాయాన్ని ఆచారాల్ని కాపాడటంలో పీసా గ్రామ సభ పాత్ర, ప్రాముఖ్యతను శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్‌గా వైఎస్ రామస్వామి, జి.సంతోషి నళిని, వ్యవహరించగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కె చంద్రరావు పాల్గొని తగు సూచనలు ఇచ్చారు. అబ్జర్వర్‌గా విశాఖపట్నం డిటిఎమ్ పి చంద్రశేఖరరావు పాల్గొన్నారు. మంగళవారం శిక్షణలో అనంతగిరి, బొర్రా, టోకూరు, ఎగువశోభ, వాలాసీ, లొంగుపర్తి, కొండిబా, పైనంపాడు, గుమ్మ, కొత్తూరు, కాశీపట్నం, పెద్ద బిడ్డ పంచాయతీల ప్రతినిధులు పాల్గొన్నట్లు ఎంపిడిఒ తెలిపారు.



గిరి రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీ జగదాంబ

జీవామృత తయారీపై అవగాహన

ప్రజాశక్తి పాడేరు

జీవామృతాల వినియోగం ద్వారా పంటలను కాలుష్యరహితంగా కాపాడుకోవచ్చని పాడేరు డివిజన్ మాస్టర్ శిక్షకులు జగదాంబ అన్నారు. మంగళవారం పాడేరులో ఘన, ద్రవ జీవామృతాల తయారీపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ జగదాంబ మాట్లాడుతూ, పంటల సాగు, సస్యరక్షణకు రసాయన ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం వలన పంటలు దిగుబడి నాణ్యత తగ్గడంతోపాటు వాటిని తీసుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యకరమైన పంట దిగుబడులకు సహజ ఎరువుల వినియోగంతోపాటు పంటల సమస్యరక్షణకు సేంద్రీయ విధానంలో తయారుచేసే ఘన,ద్రవ జీవామృతాల వినియోగం వల్ల మంచి ప్రయోజనం ఉంటుందన్నారు

రసాయన ఎరువులు వాడకుండా తక్కువ ఖర్చుతో అధిక పోషకాలున్న ఆరోగ్యకరమైన పంట దిగుబడులకు వీటిని వినియోగించాలన్నారు. ఈ ఎరువులు నిత్యం ఎన్‌పిఎం షాపులో అందుబాటులో ఉంటాయని, రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. మాస్టర్ శిక్షకులు ఆర్‌వైఎస్‌ఎస్ టీంతో పాటు పలువురు ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు



ముంచంగిపుట్టులో అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీనివాసబాబు

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు : మండలంలోని పనసపుట్టు, లుక్కురు గ్రామాల గిరి రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. మండల రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసబాబు మాట్లాడుతూ, రైతులందరు రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను కలిసి, భూముల వివరాలు, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింకైన ఫోను నెంబరుతో సంప్రదించి, తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా యునిక్ గుర్తింపు సంఖ్యను విధిగా పొందాలని సూచించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ సంక్షేమ పథకాలు, రాయితీలు, ప్రయోజనాలు పొందాలంటే ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని సూచించారు. పనసపుట్టు సర్పంచ్ జనం నోయిన, కె.మోహన్ పాల్గొన్నారు.

అనంతగిరి : ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లును నమోదు చేసుకోవడం ద్వారా ప్రతిరైతూ గుర్తింపు సంఖ్య పొందాలని, తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలకు అర్హులౌతారని మండల వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి సూచించారు. భూముల వివరాలు, ఆధార్‌కార్డు (ఆధార్ కార్డుతో అనుసంధాంచిన ఫోను నెంబరుతో సచివాలయాల్లోని వ్యవసాయ అసిస్టెంట్లను సందర్శించి, తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా తప్పనిసరిగా గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. దీనిపై మండలంలోని అందరు విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించి, వారికి సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెలాఖరులోగా రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లను నమోదుచేసుకుని, యునిక్ గుర్తింపు నంబరు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.మాణిక్యం, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఆఫర్ లెటర్ సాధించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : పీజీ పరీక్షలు పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థీ ఆఫర్ లెటర్ చేత్తో పట్టుకువెళ్లాలని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ప్లేస్మెంట్ ఆఫీసర్ వైవి.రెడ్డితో కలిసి ఫైనల్ ఇయర్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ తమ అభిరుచికి తగిన రంగాన్ని ఎంపిక చేసుకొని, అందుకు తగిన నైపుణ్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. దీనికి తగిన అన్ని ఏర్పాట్లు విశ్వవిద్యాలయం చేసిందని చెప్పారు. ప్లేస్మెంట్ డైరెక్టర్ వైవి.రెడ్డి మాట్లాడుతూ, నిరంతరం విద్యార్థులను ఉద్యోగులుగా మార్చే పనిలో ఉన్నామని, వివిధ సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపారు. అందరూ వివిధ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగం ప్లేస్‌మెంట్ ట్రైనర్ డాక్టర్ జికెడి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం : త్వరలో జరగబోయే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవీంద్ర ధామతో కలిసి సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ మార్చి 16 నుండి 31వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలు నిర్వహణకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసే విధంగా వారిని సిద్ధం చేయాలని సూచించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో ఇబ్బంది పడుతున్నారో గుర్తించి ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపియింగ్ జరగక్కుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ఆర్‌జెడి నాగమణి, ఇంటర్మీడియట్ ఆర్జెడి నరసింహమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి బి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు మోహన్ కృష్ణ, రామ తులసి, సుజాత, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణ, తాతబ్బాయి, బాపిరాజు, సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన జిల్లా ఎపిసి

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : చింతూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలన్ని జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ స్వామినాయుడు మంగళవారం సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. పెరిగిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పాల్ ల్యాబ్స్, అదనపు తరగతి గదులను గురుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోధన, బోధనేతర సిబ్బందికి తగు సూచనలు చేశారు. పాఠశాలను అన్ని విధాలుగా ముందుండేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, డిప్యూటీ డైరెక్టర్ పాపారావు, సెక్రటరీ అరుణలతో కూడిన బృందం మంగళవారం ఉదయం ఎంవిపి రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ప్రతి స్టాల్‌నూ వారు పరిశీలించి రైతుల పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకులు కనకరాజు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- అరకులోయ: గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అరకులోయ సీఐ ఎల్. హిమగిరి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. బెంగళూరుకు చెందిన మారెప్ప అనే వ్యక్తి తో పాటు, అనకాపల్లి జిల్లాకు చెందిన రాజేష్ అనే వ్యక్తి ఎపి 05 టిఎఎల్ 1347 నంబర్ గల బొలెరో వాహనంలో 225 కేజీల గంజాయిని తరలిస్తుండగా అరకులోయ ముఖద్వారంలోని ఎన్టీఆర్ గార్డెన్ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితుల వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హిమగిరి తెలిపారు.

డి.వి.రాఘవులు గెలుపునకు విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పిడిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి రాఘవులును గెలిపించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. రంపచోడవరం మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం ఆయన విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, పట్టభద్రుల సమస్యలపైనా, విద్యారంగ సమస్యలపైనా నిరంతరం శాసనమండలిలో గళం విప్పి మాట్లాడాలంటే అది కేవలం పిడిఎస్ ఎమ్మెల్సీల వల్లే మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

వై.రామవరం : పిడిఎఫ్, ప్రజా సంఘాలు బలపరిచిన ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డివి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.శాంతిరాజు మాట్లాడుతూ చట్ట సభలలో ఉపాధ్యాయులు, కార్మికులు, పేదల సమస్యలపైనా, విద్యారంగ సమస్యలపైనా పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జి.మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

విఆర్.పురం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డి.వి.రాఘవులు గెలుపు కోరుతూ సిపిఎం నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. విఆర్ పురం గ్రామంలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను, దుకాణాల్లోనూ, ఇళ్ల వద్ద పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలు ఇచ్చి రాఘవులకు మొదటి ప్రాధ్యానత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ మండలంలోని గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలపై పిడిఎఫ్ శాసన మండలిలోనూ, బయట అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పంకు సత్తిబాబు, గుండిపూడి లక్ష్మణరావు, సిహెచ్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



విఆర్.పురంలో ప్రచారం చేపడుతున్న సిపిఎం నాయకులు

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : చింతూరు మండల కేంద్రంలో ఉన్న వైన్ షాప్ యాజమాని ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని ఆయన నుండి 13 బీరు కేసులు, 11 కేసుల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై వై. వీరవెంకటసత్య లక్షణస్వామి మంగళవారం తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ ఒక లక్షా 12 వేలు రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. మద్యంతోపాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. చట్టవిరుద్ధ పనులు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కమ్మరితోటలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు : దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కమ్మరితోట గ్రామంలో ఆ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో గిరిజనులకు క్షయ వ్యాధిపై ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు జ్వరం ఉంటే వ్యాధి లక్షణాలుగా గుర్తించి ఉమ్మి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులను పరీక్షించి మందులు అందజేశారు. గర్భిణీలు ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని, చిన్నారులకు పసరు మందులు పట్టరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్‌హెచ్‌పి నాగమణి, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన మహిళకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో గిరిజన సంఘం నాయకులు మంగళవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని చికిలింత గ్రామానికి చెందిన జర్రా నూకరత్నం కొన్ని రోజులుగా అన్నవాహిక వ్యాధితో బాధపడుతున్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి గిరిజన సంఘం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో సంఘం నాయకులు పి సత్యనారాయణ, పి రాంబాబు, పి పాపరావు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. మరింత మరికొంత సహాయం అందించే అందించే విధంగా కృషి చేస్తామని చెప్పారు.



అవగాహనా కార్యక్రమానికి హాజరైన వారితో శ్రీనివాసరావు, లక్ష్మి, సరోజిని తదితరులు

పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం : విఆర్.పురం మండల రేఖపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో పీసా చట్టంపై కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎపిఎస్ఐఆర్‌డి అబ్జర్వర్ శ్రీనివాసరావు ఈ శిక్షణను సందర్శించి మాట్లాడారు. పీసా చట్టం గిరిజన ప్రాంతాల్లో అవస్యకత గురించి ఎస్‌హెచ్‌జి సభ్యులకు తెలియజేశారు. గిరిజన చట్టాలను అమలు పరచడంలో శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీడీవో ఎల్పీడీఓ రామాంజనేయ ప్రసాద్, రిసోర్స్ పర్సన్స్, పంచాయతీ సెక్రటరీ తాతారావు, శ్రీనివాసరావు, రమణ, వెలుగు సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని యువతీ యువకులు రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిందని, ఈ మూడేళ్ల కాలంలో 11 మండలాలలో 2,560 యూనిట్లు రక్తదాతలు రక్తదానం చేశారని తెలిపారు.

ఎవరైనా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, దీనిపై ఎటువంటి అపోహలు చెందవద్దని చెప్పారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మెంబర్ బొర్ర నాగరాజు, జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరీ శంకర్, కోశాధికారి సూర్యారావు, కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నాయుడు, మర్లమని, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వసుధ, డాక్టర్ యం.స్పందన, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ బాధ మహేష్ బాబు, డిగ్రీ కాలేజీ తెలుగు లెక్చరర్ రవికుమార్ రక్తదానం చేశారు. దాతలకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

చింతూరు : జిల్లాలోని చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతూరు ఐటిడిఎ, తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

న్యూడెమోక్రసీ విలీన సభ పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీన సభకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను మంగళవారం మండలంలోని తున్నూరు గ్రామ పంచాయతీ మామిడివలస గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పల్ల వెంకట నాయుడు మాట్లాడుతూ పార్టీలో నిర్మాణ సమస్యల కారణంగా 2013లో రెండుగా చీలిపోయిందని, ఆనాడు చీలిపోయిన రెండు పార్టీలు నేడు తిరిగి పునరేకీకరణ జరిగి ఐక్యమవుతున్నాయని చెప్పారు. ఈనెల 23న విజయవాడలో మాకినేని బసవపు పున్నయ్య భవన్‌లో విలీన సభ జరుగుతుందని, దానిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా నాయకులు పల్ల వెంకట నాయుడు, బొజ్జి రెడ్డి, శ్రీదేవి, గ్రామ సర్పంచ్ విజయ భాస్కర్, ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.